క్లుప్తంగా

నేడు పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని బీఆర్టీఎస్ రోడ్డు, రామకోటి దేవాలయం వద్ద శనివారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యుడు ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఉపసభాపతి కోన రఘుపతితో పాటుగా పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నగర మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నగరవాసులు తరలివచ్చి పీవీ నరసింహారావుకు నివాళులర్పించాలని ఆయన కోరారు.

బాబా మందిరం గోశాలకు పుంగనూరు గిత్తదూడ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం గోశాలకు కృష్ణలంకకు చెందిన వేదపండితులు సుబ్రహ్మణ్యం పుంగనూరు గిత్తదూడను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పుంగనూరు గిత్తదూడకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. బాబా మందిరానికి పుంగనూరు గిత్తదూడను అందజేసిన వేదపండితులు సుబ్రహ్మణ్యంకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

అదనపు వాటర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న ఇళ్ల నిర్మాణాలకు అనుగుణంగా మంచినీటి సరఫరా నిమిత్తం అదనంగా వాటర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని కోరుతూ 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ వీఎంసీ వాటర్ విభాగం సీఈ ఆర్.శ్రీనాథ్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. బర్మాకాలనీ, రాధానగర్, ప్రజాశక్తి నగర్, ఎన్ఎస్ బోస్ నగర్, మణికంఠ నగర్, ఏఎస్ రామారావు కాలనీ, ఎన్‌జీఓఏ కాలనీ, పాత కండ్రికలో మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో హ్యాపీ ఫౌండేషన్ ఆధ్వర్యాన శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఉమర్ ఆలీ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్స్ అందజేసిన హ్యాపీ ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో స్టడీ మెటీరియల్స్ సంవత్సరం చివరిలో వచ్చేవని, కాని స్కూల్ మొదలయ్యే సమయానికే ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ హెచ్ఎం శ్రీనివాసరావు, హ్యాపీ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్నారి వైద్య ఖర్చులకుగానూ హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీ మాట్లాడుతూ వాంబేకాలనీకి చెందిన చిన్నారి విక్రమ్ దవడకు ఇన్‌ఫెక్షన్ వచ్చిందన్నారు. చిన్నారికి సర్జరీ నిమిత్తం తమ వంతు సాయంగా రూ. 10వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 30వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఆ కళాశాల ఇంటర్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ టెక్కెం విజయ బాబు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్‌లోని అన్ని గ్రూపు సబ్జెక్ట్‌లకు శిక్షణ ఇస్తామని, ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 79952 50842, 81061 58174 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డ్రెయిన్లు.. యమ డేంజర్

- కల్వర్టు బిళ్లలు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు
- భయాందోళనలో స్థానిక ప్రజలు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు



గుజ్జల సరళాదేవి కల్యాణ మండపం వెనుక కాలువలో పడిపోయిన ఆవును పైకి లాగుతున్న అధికారులు, ప్రజలు (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని రహదారుల వెంబడి ఉన్న ప్రధాన డ్రెయిన్లు స్థానిక ప్రజల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. ఐదారు అడుగుల లోతు నీళ్లతో నిండిన డ్రెయిన్లపై కల్వర్టులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇవి ఎవరిని ఎప్పుడు పడేద్దామా.. అన్నట్లుగా ప్రజలు, ప్రయాణికులు, పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

రక్షణ చర్యలు నిల్

సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్, లూనాసెంటర్, పీఅండ్‌టీ కాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట, నందమూరినగర్, వాంబేకాలనీ, తోటవారివీధి పరిసర ప్రాంతాల్లోని ప్రధాన మార్గాల్లో రోడ్డు వెంబడి ఉన్న సైడు కాలువలపై కల్వర్టు బిళ్లలను చాలా చోట్ల వేయకుండా వదిలేశారు. దీంతో పాదచారులు, చిన్నారులు తరచూ వాటిల్లో పడిపోయి గాయాలపాలవుతున్నారు. పది రోజుల క్రితం తోటవారి వీధి ఎనిమిదో లైనుకు చెందిన చిన్నారులు రోడ్డుపై ఆడుకుంటూ ఉండగా ప్రసాద్ అనే బాలుడు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. దీంతో బాలుడి కాళ్లు, చేతులకు దెబ్బలు తగిలాయి. రెండు రోజుల క్రితం సింగ్‌నగర్ గుజ్జల సరళాదేవి కల్యాణ మండపం వెనుక భాగంలో ఓ ఆవు కాలువలో పడిపోయింది. దీంతో స్థానికులు, శానిటరీ అధికారులు, సిబ్బంది జేసీబీ సాయంతో ఆ ఆవును బయటకు తీయాల్సివచ్చింది. అలాగే సింగ్‌నగర్ డాబాకొట్లు వద్ద ఓ కళాశాల విద్యార్థి బస్సు కోసం వెళ్లే క్రమంలో ఇదే విధంగా కాలువలో పడిపోయి గాయాలపాలయ్యాడు. ఎటువంటి రక్షణ చర్యలు లేని డ్రెయిన్ల వల్ల తరచూ స్థానిక ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడాల్సివస్తోంది.



సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద ప్రమాదభరితంగా ఉన్న ప్రధాన డ్రెయిన్

డ్రెయిన్లపై కల్వర్టులు ఏర్పాటు చేయాలి

సింగ్‌నగర్ రైతుబజార్, గుజ్జల సరళాదేవి కల్యాణ మండపం వెనుక భాగం, నార్త్‌జోన్ తహసీల్దారు కార్యాలయం వెనుక భాగం, తోటవారి వీధి ప్రధాన లైను, వాంబేకాలనీ ఏ - బ్లాకు పరిసర ప్రాంతాల్లోని డ్రెయిన్ల వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంత ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ప్రజలు, ప్రయాణికులు, పశువుల పాలిట శాపంగా మారుతున్న ఈ డ్రెయిన్లపై కల్వర్టులు ఏర్పాటు చేసి వీటి భారి నుంచి తమకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ప్రాధేయపడుతున్నారు.



తోటవారి వీధిలోని ప్రధాన మార్గంలో డ్రెయిన్

కూటమి నేతలను నిలదీయాలి

స్మార్ట్ మీటర్లపై సీపీఎం పోరుబాట

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారని.. దీనిపై ప్రజాప్రతినిధులను, కూటమి నేతలను నిలదీయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. విజయవాడ న్యూరాజరాజేశ్వరిపేటలో శుక్రవారం స్మార్ట్ మీటర్లపై సీపీఎం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి తొలి అడుగే తప్పటడుగు అన్నారు. కుటుంబ సభ్యులందరూ రోజంతా పనుల్లోకి వెళ్లి నివాసంలో లేకపోయినా వందల రూపాయలు బిల్లులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల ఖజానా నింపడానికి సామాన్యులపై విద్యుత్ బిల్లులు పెంచడం తగదని అన్నారు. స్మార్ట్ మీటర్లను అడ్డుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏడాది కూటమి పాలనలో తమ ఘనత గురించి చెప్పడానికి జూలై ఒకటో తేదీ నుంచి వచ్చే ప్రజాప్రతినిధులను, కూటమి నేతలను విద్యుత్ ఛార్జీలపై నిలదీయాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లపై మాట తప్పిన పాలకులు

ప్రజలకు సంక్షేమ పథకాలతో నగదు ఇవ్వక పోగా, విద్యుత్ బిల్లుల రూపంలో ప్రజల నుంచే ప్రభుత్వం వసూలు చేయడం దారుణమన్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వం సాధించిన విజయం ? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లపై పాలకులు మాట తప్పారని పేర్కొన్నారు. నమ్మకద్రోహం చేసిన కూటమి నేతలను ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. మోదీ ప్రభుత్వ ఆదేశాలతో ఆదాని, కార్పొరేట్ కంపెనీలు రాష్ట్ర ప్రజలను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరిపేటకు చెందిన బి. సైదులమ్మ తమ విద్యుత్ బిల్లు రూ.609, అదనపు సర్దుబాటు చార్జీలు రూ. 357 మొత్తం కలిపి రూ. 966 బిల్లు వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీ రమణరావు, టీ శ్రీనివాస్, ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరిపేటలో విద్యుత్ బిల్లును చూపుతున్న సీపీఎం నాయకుడు బాబూరావు

అలరించిన సంగీతోత్సవాలు



విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 108, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో శిష్యప్రశిష్య బృందం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆరాధాన సంగీతోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన రాయప్రోలు సుబ్రహ్మణ్యం కీబోర్డుపై, అమెరికాకు చెందిన సాయితేజ, హైదరాబాద్‌కు చెందిన డీవీఎల్ ఎన్ శాస్త్రి, బీ సీతాలక్ష్మి, ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్, అమూల్య బృందం గాత్రంతోనూ వాగ్గేయకారుల కృతులను ఆలపించారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్ మాట్లాడుతూ శనివారం అలంకార్ సెంటర్‌లోని పారుపల్లి రామకృష్ణయ్య విగ్రహం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు పుష్పాంజలి, అలాగే ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు త్యాగరాజ స్వామి కృతుల గోష్ఠిగానం ఉంటుందని తెలిపారు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వాహనాల రాకపోకలను ఆటంకం కలిగేలా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కే కిషోర్‌బాబు వ్యాపారులను హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ పర్యవేక్షణలో మూడవ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కేదారేశ్వరపేట, సీకేరెడ్డి రోడ్డు ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణలపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న పండ్లు, కూరగాయలు, చెక్క వ్యాపారులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యాపారులు తమ సామగ్రిని రోడ్ల మీద నుంచి తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. సీకే రెడ్డి రోడ్డు నగరంలోనే ఒక ముఖ్యమైన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందన్నారు. ఆక్రమణల ద్వారా ఈ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అనంతరం వ్యాపారులు రహదారిపై ఆక్రమణలను తొలగించి వారి సరిహద్దుల్లోనే వ్యాపారాలు చేసుకుంటామని, ట్రాఫిక్ సమస్య కలిగించమని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జీవీఎస్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.





జయ జయహే జగన్నాథ

ప్రసిద్ధి గాంచిన జగన్నాథ రథయాత్ర భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభమైంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలోని లేబర్‌కాలనీ గ్రౌండ్ నుంచి దాదాపు 6 కిలోమీటర్ల మేర సాగింది. మంగళ వాయిద్యాలు, మహిళల కోలాటాల నడుమ జగన్నాథుడు, బలభద్రుడు - సుభద్ర దేవి వేంచేసి ఉన్న రథం పుర వీధులగుండా వెళుతుండగా భక్తులు రోడ్లపై రంగవల్లులను తీర్చిదిద్ది స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





మనసారా.. కొలిసారె





ఆషాఢ మాసోత్సవాలు, శుక్రవారం నేపథ్యంలో దుర్గమ్మ సన్నిధి భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించాయి. భక్తితో ప్రణమిల్లాయి. దీంతో మహా మండపం ఆరో అంతస్తులో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





నగర అభివృద్ధికే ప్రాధాన్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): తాము అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు విజయవాడ నగరాన్ని చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామని నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయింపులు, మంజూరు చేసి అన్ని వర్గాలకు, అన్ని డివిజన్లకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందించామని స్పష్టం చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఫ్లోర్ లీడర్ చాంబర్లో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజరెడ్డి, ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యంతో కలిసి శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాము కౌన్సిల్‌లో కొలువుదీరిన 2021 నుంచి ఇప్పటి వరకు తాము మొత్తం 24 కౌన్సిల్స్ జరిగాయని, పార్టీలకతీతంగా నగరంలోని 64 డివిజన్లను పోటీపడి అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా మేయర్ చెప్పారు. ఉద్యోగుల సమస్యల నుంచి అనేక అంశాలు పరిష్కరించామని గుర్తు చేశారు.

కూటమి పాలనలో కుంటుపడిన అభివృద్ధి..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన గతేడాది నుంచే నగరంలో అభివృద్ధి కుటుంపడిందని మేయర్ చెప్పారు. బుడమేరు వరదల అనంతరం నగరంలోని 100 పనులకు టెండర్లు, కాంట్రాక్టు కేటాయింపులు చేస్తే కేవలం వాటిలో 15 పనులు మాత్రమే జరుగుతున్నాయని వివరించారు. అయితే కేవలం కొంతమంది స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకొస్తున్న అంశాలను మాత్రం ఇటీవల జరిగిన కౌన్సిల్లో తిరస్కరించామని స్పష్టం చేశారు.

నాడూ తిరస్కరించారు..

ఐలా పరిధిలో ఉన్న ఏపీఐఐసీ కాలనీలోని జమాక్ (జవహర్ ఆటోనగర్ మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ స్టోర్స్)కు తాగునీరు ఇవ్వాలని వచ్చిన ప్రతిపాదనపై ఐలా నుంచి వీఎంసీకి రావాల్సిన బకాయిలు రూ. 25 లక్షలు చెల్లించాలని, దీనిపై సంబంధిత సంస్థ నుంచి ఎలాంటి సంప్రదింపులు లేకుండా నీరు సరఫరా చేయాలని వచ్చిన ప్రతిపాదనను తిరస్కరించామని మేయర్ చెప్పారు. ఇదే అంశాన్ని 2014–19 టీడీపీ కౌన్సిల్ సమయంలో కూడా అప్పటి మేయర్ కోనేరు శ్రీధర్ కూడా తిరస్కరించారని.. అప్పుడురాని అభ్యంతరం ఇప్పుడు ఎందుకు వస్తోందని ఆమె ప్రశ్నించారు.

నాడు–నేడు అభివృద్ధి చూడండి..

వైఎస్సార్‌సీపీ వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యం మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని 2021 వరకు చేసిన అభివృద్ధి, 2021 తర్వాత చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని చెప్పారు. డెప్యూటీ మేయర్ బెల్లందుర్గ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయాలని వచ్చిన ప్రతిపాదనలో లోటుపాట్లును కూడా తెలుసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తే అంబులెన్సుల రాకపోకలకు, వాహనాల పార్కింగ్‌కు సమస్య ఉత్పన్నమవుతుందని, దీన్ని పరిగణనలోకి తీసుకునే తాము తిరస్కరించామన్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలి..

డెప్యూటీ మేయర్ అవుతుశైలజ రెడ్డి మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో తాము వచ్చాకే అభివృద్ధి చేశామని చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో బస్‌స్టాండ్ ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను ఈ ప్రభుత్వం రద్దు చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పెరుగుతున్న వాహనాలు, ట్రాఫిక్ దృష్ట్యా ఈ ప్రాంతంలో బస్టాండ్ అవసరమని అన్నారు. ఈ ప్రభుత్వం దీన్ని రద్దుచేసి చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించటం హేయమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లందుర్గ, అవుతు శైలజ, ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ స్టేషన్ 11కేవీ జింఖానా ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్సీఎం చర్చి రోడ్డు, అల్లావుద్దీన్ వీధి, డేవిడ్ వీధి, పప్పులు మిల్స్ వీధి, నాడార్ వీధి, పాల బజారు, కత్తి రామయ్య వీధి, వినుకొండవారి వీధి, వంగ సుందర వీధి, హార్ట్ పేట, పీటర్ వీధి, కాశీం వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నున్న(విజయవాడరూరల్): నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నున్న, మ్యాంగో మార్కెట్, విలేజి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాయకాపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్డ్ రాజీవ్‌నగర్, ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, వడ్డెర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వాంబేకాలనీలో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక తనిఖీలు, మరమ్మతుల కారణంగా 60వ డివిజన్ వాంబేకాలనీలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాంబేకాలనీ జేఎన్‌న్యూఆర్ఎం అపార్ట్‌మెంట్స్, ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ బ్లాకులు, డిస్నీ ల్యాండ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• కోరం లేక సమావేశం వాయిదా

విజయవాడరూరల్: కోరం లేకపోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం వాయిదా పడింది. 40 మంది ఎంపీటీసీ సభ్యులున్న మండల పరిషత్ పాలక వర్గంలో మూడో వంతు సభ్యులు కూడా హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి తెలిపారు.